క్లుప్తంగా

పదోన్నతులు కల్పించాలి



ఏటూరునాగారం: భాష పండితులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పబ్బు వెంకటేశ్వర్లు, జట్టి సుభాష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో భాషోపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించకపోవడాన్ని నిరసిస్తూ పాఠశాలలోని తెలుగు, హిందీ లాంగ్వేజ్ పండితులు భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సుభాష్ మాట్లాడుతూ 2007 సంవత్సరంలో జరిగిన తెలుగు ప్రపంచ మహాసభలలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పల్లె నాగరాజు, రాజేష్, భాగ్యవతి పాల్గొన్నారు.

చీరలు, సరుకుల పంపిణీ



వాజేడు: గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పలు గ్రామాల్లోని 154 మంది వితంతువులకు చీరలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండల పరిధిలోని ప్రగళ్లపల్లి, చెరుకూరు, కోయ వీరాపురం, బొల్లారం గ్రామాల్లో ఎంపీపీ శ్యామల శారద, మొరుమూరు సర్పంచ్ పూసం నరేష్ చేతుల మీదుగా వీటిని అందించారు.

పూడికతీత పరిశీలన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 5వ వార్డులో డ్రెయినేజీ పూడికతీత పనులను సర్పంచ్ ఈసం రామ్మూర్తి బుధవారం పరిశీలించారు. కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు నీరు ఎటు వెళ్లలేని పరిస్థితి ఉండడంతో పూడికతీత పనులను చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రజలు చెత్తాచెదారం కాల్వల్లో వేయకుండా చెత్తబుట్టలో వేసి, డంప్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. చెత్తాచెదారం కాల్వలో వేయడం వల్ల వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన, తద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉన్నారు.

సోమయ్యకు సన్మానం

మంగపేట : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్యను ఆపార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుధవారం శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర మంగపేట మండల ఇన్‌చార్జ్‌గా ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్యను నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. సోమయ్యను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పల్లికొండ యాదగిరి, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్, మండల మీడియా ఇంచార్జి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు చౌళం వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మురుకుట్ల నరెందర్, నాయకులు ఆకు పవన్, కాంతారావు, లాలయ్య, సతీష్ పాల్గొన్నారు.

కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలి



ములుగు రూరల్(గోవిందరావుపేట): విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలని రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్య దేవ్‌సింగ్ అన్నారు. ఈ మేరకు బుధవారం గోవిందరావుపేట మండలంలోని చల్వాయి కస్తూరి బా గాంధీ పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 10 జీపీఏ సాధించే విధంగా ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని అన్నారు. తల్లితండ్రులు కన్న కలలను , పాఠశాలకు పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఫంక్షన్‌హాలులో బుధవారం ఓడ బలిజ సేవా సంఘం క్యాలెండర్‌ను తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ అడ్డూరి బాబుతో కలిసి ఆవిష్కరించారు. దామోదర్, వెంకట్రావ్, గాంధీ, రమణయ్య ఉన్నారు.

సమాజ మార్పు ఓటరుకే సాధ్యం

సమాజ మార్పు ఓటరుకే సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతనను వివరించారు.



వాజేడు: విద్యార్థుల మానవహారం



ఎస్ఎస్ తాడ్వాయి: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వెంకటాపురం జెడ్పీటీసీ పాయం రమణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. వెంకటాపురం ఎస్సై అశోక్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, సర్పంచ్ చిడెం యామిలి ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఈర్ప సునిల్, ఎంఈఓ సాంబయ్య, పాఠశాల హెచ్ఎం పద్మా, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లిలో రెవెన్యూ అధికారులు ప్రపంచ ఓటర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముప్పనపల్లిలోని పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి ప్రధాన రహదారిపై మండల రెవెన్యూ అధికారి వీరస్వామి ఓటు హక్కు గురించి ర్యాలీ తీశారు. ఎంపీడీఓ పనిచంద్ర,ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

మానవహారం

వాజేడు: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వాజేడు మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ గూడూరు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సదర్భంగా ఓటు హక్కు విలువను తెలుపుతూ పలు నినాదాలను చేశారు. అనంతరం మండల కేంద్రంలో విద్యార్థులు, ఉద్యోగస్తులు, పలు పార్టీల నాయకులతో కలిసి మానవ హారం నిర్వహించారు. గుమ్మడి దొడ్డి గ్రామంలో సర్పంచ్ పాయం జయలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.

జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ

మంగపేట: మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రజా స్వామ్యంలో ప్రజల ఓటు హక్కు బలంపై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో దేశ సంప్రదాయాలను గౌరవిస్తు స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ శ్రీధర్, మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ కుమారస్వామి, హెచ్ఎం, కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటయ్య పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం

ఏటూరునాగారం: రాజ్యాంగం మనకు ఇచ్చిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, దానిని సక్రమంగా ఉపయోగిస్తే దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను మార్చుకోవచ్చని జెడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని రెవెన్యూ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ, ఎంపీడీఓ కుమార్, స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి, ఎంఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో..



కన్నాయిగూడెంలో..



వెంకటాపురం(కె): ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ



వాజేడు: ర్యాలీ ప్రదర్శన



మంగపేట: మండల కేంద్రంలో విద్యార్థుల ర్యాలీ

టీచర్లను నియమించాలి

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండల పరిధిలోని ఆశ్రమ పాఠశాలకు సీఆర్‌టీ ఫిజికల్ డైరెక్టర్ టీచర్లను నియమించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఈ నెల 19వ తేదీన 26 మంది సీఆర్‌టీలను నియమించాలని ఐటీడీఏ అధికారులకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని కన్నాయిగూడెం పీడీ, పీఈటీ, కొడిశాలలో పీడీ, పీఈటీ, బ్రాహ్మణపల్లి పీఈటీ, చుంచుపల్లిలో పాఠశాలల్లో పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అయితే మూడు సీఆర్‌టీ, పీఈటీల పోస్టులను మహబూబాబాద్ జిల్లాకు కేటాయించడం విడ్డూరంగా ఉందని వాపోయారు. ఈ విషయంపై ఐటీడీఏ పీఓ అంకిత్‌కు వినతి పత్రాన్ని అందజేయనున్నట్లు వివరించారు.

యూత్ సభ్యులకు వాలీబాల్, నెట్ అందజేత



వాలీబాల్, నెట్‌ను అందజేస్తున్న నర్సయ్య

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకుల వారిఘణపురం ప్రాంతానికి చెందిన ఆదర్శ యూత్ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు గండెపల్లి నర్సయ్య వాలీబాల్, నెట్‌ను బుధవారం అందజేశారు. ఆదర్శ యూత్ సభ్యుల ద్వారా మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించే క్రమంలో ఈ కిట్ అందజేసినట్లు నర్సయ్య తెలిపారు. యువత క్రీడల్లో నైపుణ్యత పొందాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఖాజాపాషా, కాళ్ల రామకృష్ణ, బూర వెంకన్న, రఘు, నీలకంఠం, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలకు కర్ర తరలింపు

- అటవీశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఫీజు వసూలు
- అనుమతి లేని ఇటుక బట్టీలు
- పట్టించుకోని అటవీశాఖ ఉన్నతాధికారులు



ట్రాక్టర్‌లో ఇటుక బట్టీలకు తరలిస్తున్న కర్ర

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో కలప డిపో (టింబర్ డిపో) ఉంది. దాని వెనుక ఉన్న దుంగలు, ఇతర చెట్ల కొమ్మలను ఇటుక బట్టీలకు అటవీశాఖ అధికారుల అండదండలతో ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారం అడవిలో నుంచి వంట చెరుకు (పొయ్యిలకు) కర్రలను తీసుకువస్తే దానికి విలువ ప్రకారం సీ ఫీజ్‌ను అటవీశాఖ అధికారులు కట్టించుకొని అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ టింబర్ డిపోల నుంచి కర్రలను తరలించి వాటిని సీ ఫీజ్ వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు. టింబర్ డిపోల నుంచి ఏ కర్రను బయటకు తీసుకురావాలన్న అందుకు తగ్గట్టుగా వేలం పాట నిర్వహించి గుత్తేదారులకు అప్పగించాల్సి ఉంటుంది. అటవీశాఖ అధికారికి నమ్మిన బంటుగా ఉన్న భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి కనుసన్నల్లోనే ఈ ఇటుక బట్టీ వ్యాపారం కొనసాగుతోంది. ఇటుక బట్టీలకు కేవలం ఊక, బొగ్గు లాంటివి వాడాల్సి ఉంది. కానీ కర్రలను ఏకంగా అటవీశాఖ కార్యాలయం నుంచి తరలించడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా వంట చెరుకు (ఇటుకబట్టీల)కోసం కర్రలను తరలించిన అధికారులపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వనప్రేమికులు కోరుతున్నారు.

ఒక బీట్ పరిధిలోని కర్రకు..
మరో బీట్ ఆఫీసర్ రశీదు

అటవీశాఖ రేంజ్ కార్యాలయం ఉన్నది ఏటూరునాగారం బీట్ పరిధిలో కానీ సీ ఫీజ్ మాత్రం రొయ్యూర్ బీట్‌కు చెందిన బీట్ ఆఫీసర్ ద్వారా అప్పటికప్పుడు సీ ఫీజ్‌ను కట్టించుకున్నారు. మీడియా వారికి ఈ సమాచారం అందడంతో తప్పును అధికారికంగా చేయాలనే ఉద్దేశంతో అటవీశాఖ అధికారులు సీ ఫీజ్‌ను వేరే బీట్ అధికారి ద్వారా జారీ చేయించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కర్ర తరలించేందుకు వచ్చిన వ్యక్తి పేరు, అడ్రస్ భద్రాచలం ఉండగా కర్ర మాత్రం మండల కేంద్రానికి కూతవేటు దూరంలోకి తరలించడం గమనార్హం. అయితే అటవీశాఖ అధికారులే పక్కా ప్లాన్ చేసి ఈ కర్రను సదరు బట్టీ వ్యాపారికి అప్పనంగా అందించాలని చట్టంలోని లొసుగులను వాడుకొని వారి పని కానించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనల మేరకే ఇచ్చాం..

ఈ విషయంపై రేంజ్ అధికారి బాలరాజును వివరణ కోరగా ఉపయోగంలోకి రాని కర్ర, స్కేల్క్ కొలతలకు వీలుపడని కర్ర కావడంతో ఇటుక బట్టీ వ్యాపారి కావాలంటే సీ ఫీజ్‌ను తీసుకొని కర్రను రెండు ట్రిప్పులు ఇచ్చామని తెలిపారు. నిబంధనల మేరకు ఇచ్చామని వివరించారు.

అప్రకటిత విద్యుత్ కోతలు.. రైతుల ఆందోళన



వెంకటాపురం(కె)లో..



వాజేడు: ధర్మవరంలో ధర్నా చేస్తున్న రైతులు



కన్నాయిగూడెం: ఏటూరు సబ్ స్టేషన్ వద్ద..

వాజేడు: అప్రకటిత విద్యుత్ కోతలు చేపడుతుండటంతో రైతులు ఆందోళన బాట పట్టారు. వరి, మిర్చి, మొక్కజొన్న మొదలైన పంటలను మండలంలో రైతులు భారీ ఎత్తున సాగు చేశారు. కాగా మంగళవారం నుంచి సమయం సదర్భం లేకుండా విద్యుత్ శాఖ సిబ్బంది త్రీ పేస్ విద్యుత్ లైన్ కోతలను విధిస్తున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందని ప్రశ్నించిన రైతులతో తమకు సమాచారం లేదని ఉన్నతాధికారులు ఎప్పుడు ఇవ్వమని సమాచారం ఇస్తే అప్పుడే ఇస్తామని తెలుపుతున్నారు. దీంతో పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా వాజేడు, ధర్మవరం విద్యుత్ సబ్ స్టేషన్ల ముందు రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. అందులో భాగంగా ధర్మవరం గ్రామంలో రహదారిపై బైటాయించారు. తమకు విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చెయ్యాలని డిమాండ్ చేశారు.

కన్నాయిగూడెం: పంట పొలాలకు విద్యుత్ ఇవ్వాలంటూ ఏటూరు సబ్‌స్టేషన్ వద్ద రైతులు బైటాయించారు. గత మూడు రోజుల నుంచి మండలంలోని పంట పొలాలకు ఇవ్వవలసిన పగటి పూట ఇవ్వవలసిన 12 గంటల త్రీపేస్ కరెంట్ ఎప్పుడు ఇస్తున్నారో, తెలియడంలేదని, ఆగ్రహానికి గురయ్యారు. ప్రభుత్వం రైతులకు 24 గంటల త్రీఫేజ్ కరెంట్ ఇస్తామన్న మాట, గాలిమాటగానే మిగిలిందన్నారు. పంట పొలాలు నీరు లేక ఎండుతున్నాయన్నారు. పంట పొలాలకు కరెంటు లేక రైతులు బుధవారం ఏటూరు సబ్ స్టేషన్ ఎదుట విద్యుత్ అధికారులతో వాగ్వాదానికి దిగారు.

కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

వెంకటాపురం(కె): వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్‌లో కోతలు లేకుండి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ బుధవారం విద్యుత్ శాఖ ఏఈ బెనర్జీకి రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి పగలు ఇచ్చే విద్యుత్ లో కోతలు పెడుతున్నారని దాని వల్ల రైతుల మిర్చి తోటలు దెబ్బ తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఆదినారాయణ, రాములు, రవి, ఎంపీటీసీ రవి, ఈశ్వర్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన ఎగ్గడి లక్ష్మీత్‌వర్మకు రూ.60వేల చెక్కును, రొయ్యూర్ గ్రామానికి చెందిన గడ్డం తిరుపతికి రూ.28,500 చెక్కును అందజేసినట్లు సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ కృషితో లబ్ధిదారులకు చెక్కులు త్వరగా వచ్చాయన్నారు. వారు అనారోగ్య కారణంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారన్నారు. ఈ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వారికి వచ్చిన చెక్కులను బీఆర్ఎస్ ద్వారా అందజేసి ఆదుకున్నామన్నారు. జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, జిల్లా కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీసలీం, రామన్నగూడెం ఎంపీటీసీ అల్లి సుమలత శ్రీనివాస్, సర్పంచ్ కృష్ణ, నాయకులు మల్లారెడ్డి, మేడారం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ రాంనర్సయ్య, స్వప్నచంద్రబాబు, రాంబాబు, రమేష్, శ్రీనివాస్, చిన్ని, నర్సయ్య, విజయ్, వెంకన్న, వీరన్న, ఇట్టెం నాగరాజు, మహేశ్వరరావు, కోటయ్య ఉన్నారు.

క్రైమ్ కార్నర్

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి



బోల్తాపడిన ట్రాక్టర్‌ను పైకి లేపుతున్న గ్రామస్తులు



సత్యనారాయణ

మంగపేట: మండలంలోని గాంధీనగర్ ఊరి చివర దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్ ఇంజన్ రోడ్డు పక్కకు దూసుకుపోయి బోల్తాపడిన సంఘటనలో మండలంలోని నరెందర్‌రావుపేటకు చెందిన కొడెం సత్యనారాయణ (25) డ్రైవర్ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ఎస్‌కే తాహెర్‌బాబా తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బాలన్నగూడెం పంచాయతీ పరిధిలోని నరెందర్‌రావు పేటకు చెందిన కొడెం సత్యనారాయణ ఉదయం సుమారు 09 గంటల ప్రాంతంలో తన పొలంలో దమ్ము చేసేందుకు తన స్వంత ట్రాక్టర్‌ను నడపుకుంటూ నర్సింహాసాగర్ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ మీదుగా పూరేడుపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుపై దమ్ముచక్రాలు(కేజీవీల్స్)తో వెళ్తున్నాడు. ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడపడం వలన రోడ్డుపై మోరీని ఢీ కొట్టడంతో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకువెళ్లి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న సత్యనారాయణ ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

మండల కేంద్రంలోని సినిమాహాల్ వీధికి చెందిన వివాహిత అజ్మీరా వెన్నెల(30) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు మృతురాలి తల్లి భూక్య విజయ ఫిర్యాదు మేరకు బుధవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే తాహెర్ బాబా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కమలాపురానికి చెందిన అజ్మీరా చందులాల్(చందు)తో ములుగు మండలం కొడిశల కుంటకు చెందిన వెన్నెలకు 2014లో వివాహం అయింది. గత నాలుగు సంవత్సరాల నుంచి మండల కేంద్రంలో సిమెంట్, ఐరన్ షాపు నిర్వహిస్తూ.. సినిమాహాల్ రోడ్డులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. డబ్బుల విషయంలో భార్య భర్తల మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో తన కుమార్తె కొద్ది నెలలుగా మానసికంగా ఇబ్బంది పడుతోందని మంగళవారం అదే విషయంలో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలు తల్లి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతురాలికు ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారని ఎస్సై పేర్కొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



మంగపేటలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మంగపేట: 18ఏళ్లకు పైబడిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ సూచించారు. మంగపేట, బుచ్చంపేట గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్యపరీక్షల శిబిరాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఆయా శిబిరాల్లో ఎంత మందికి పరీక్షలు నిర్వహించారనే వివరాలను సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెండు శిబిరాల్లో 243 మందికి కంటి పరీక్షలు చేసి 62మందికి రీడింగ్ అద్దాలను అందజేసినట్లు తెలిపారు. మరో 18మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలకు సిఫారసు చేసి మరో ఇద్దరిని శస్త్ర చికిత్స చేసేందుకు వరంగల్ కంటి ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఆర్ఐ తదితర అధికారులతో ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల వివరాల గురించి తహసీల్దార్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి మాలోత్ హీరా, వైద్యాధికారి అల్లె నరేష్, స్వప్నిత, ప్రేమ్‌సింగ్, నాగ అన్వేష్, సంధ్య, ఆప్టోమెట్రిక్ ఆఫీసర్ శుష్మ, హెల్త్ సూపర్‌వైజర్ గంగమ్మ పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని తహసీల్దార్ లక్ష్మణ్ బుధవారం పరిశీలించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన ఎలా ఉందో వాజేడు వైద్యాధికారి అభినయ్ తో మాట్లాడి తెలుసుకున్నారు.

జీవన ఎరువు వాడండి



వాజేడు: ఎరువు తయారీని వివరిస్తున్న అధికారులు

వాజేడు: రైతులు వరి పొలాల్లో జీవన ఎరువులను ఎలా వాడాలో ఏటూరునాగారం ఏడీఏ శ్రీధర్ తెలిపారు. మండల పరిధిలోని పేరూరులో రైతులు భాస్వరం స్థిరీకరించే బ్యాక్టీరియాను ఎలా తయారు చేసుకోవాలో, ఎందుకు వాడాలో వివరించారు. రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడటం మూలంగా భూమికి మేలు చేసే బ్యాక్టీరియా శాతం తగ్గి పోయి భూములు చవుడుగా మారుతాయని తెలిపారు. భూమిలోని బ్యాక్టీరియాను స్థిరీకరించ దానికి జీవన ఎరువును 1.5నుంచి 2 కేజీలను 20 నుంచి 25 కేజీల సేంద్రియ ఎరువులో కలుపుకొని నాటు వేసిన మూడు రోజుల్లో చల్లుకోవాలని సూచించారు. రైతులకు జీవన ఎరువును వాడే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ఆయన వెంట ఏటగుంటుక నర్సింహారావు, ఏఈఓ హరీష్ ఉన్నారు.

సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్



వాజేడు: పనిముట్లు అందజేస్తున్న అధికారులు

వాజేడు: మండల పరిధిలోని పేరూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం సీఆర్‌పీఎఫ్ 2/ఐసీ బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పేరూరు ఎస్సై హరీశ్, సీఆర్‌పీఎఫ్ 2/ఐసీ శాంతాదేవి, జీ/ 39 ఏసీ అనీష్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శంకర్ వ్యవసాయ పనిముట్లు, పార, పలుగు, కొడవల్లు, ఎరువుల బస్తాలను అందించారు.